RNI NO APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం । 21 । జూన్ । 2026

# హుస్నాబాద్ కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్



**హుస్నాబాద్ జూన్ 20 (తెలంగాణ వాణి ఆర్ సి)**
సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి బి. రేవతి మాట్లాడుతూ రాజీమార్గమే రాజమార్గంఅనిపేర్కొన్నారు. ప్రజలు తమ విలువైన సమయం, డబ్బును వృథాచేసుకోకుండా కోర్టుల చుట్టూ తిరగకుండా, ఇరు వర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీ కుదుర్చుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా రాజీ పడే కేసులను వేగంగా పరిష్కరించుకోవచ్చని, దీంతో సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు ఇరు వర్గాలమధ్యసత్సంబంధాలు కొనసాగుతాయని న్యాయ వాదులు తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ప్రమిద, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాజశేఖర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు, హుస్నాబాద్ ఏసీపీ సదానందం, సీఐ కొండ్ర శ్రీనివాస్, హుస్నాబాద్ ఎస్సై పి. లక్ష్మిరెడ్డి, అక్కన్నపేట ఎస్సై సిహెచ్. ప్రశాంత్, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఒగ్గోజు సదానందం,న్యాయవాదులు కన్నోజు రామకృష్ణ, బాకం సంపత్, దీకొండ ప్రవీణ్, సంధ్యారాణి, వివిధ బ్యాంకుల మేనేజర్లు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి విద్యానికేతన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు




**పెద్దపల్లి, జూన్ 20 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
పెద్దపల్లిలోని గాయత్రి విద్యానికేతన్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను వివరించడంతో పాటు, యోగ సాధన ద్వారా కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. గాయత్రి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. విద్యార్థుల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెంపొందించడానికి, అలాగే శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు ఉపయోగపడే పలు యోగాసనాలను ప్రదర్శించి వాటి విశిష్టతను వివరించారు.ప్రస్తుత కాలంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని తగ్గించుకోవడానికి, మానసిక ప్రశాంతతను పొందడానికి యోగ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ యోగాసనాలను విద్యార్థులతో చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు 8వ తరగతి విద్యార్థి సంపంగి ప్రవీణ్ అద్భుతమైన యోగ విన్యాసాలు ప్రదర్శించి అందరి ప్రశంసలు అందుకున్నాడు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు యోగ విశిష్టతను తెలుసుకొని, ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సంకల్పించారు.ఈ కార్యక్రమంలో గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రియాంక, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# త్వరలోనే వేములవాడ బైపాస్ రోడ్డుకు సరికొత్త వెలుగులు

## ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చొరవతో వేములవాడ అభివృద్ధి పనుల పురోగతిని కమీషనర్ లోకేష్‌తో కలిసి పరిశీలించిన చైర్మన్ పుల్కం రాజు



**వేములవాడ,జూన్ 20 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
వేములవాడ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందులో భాగంగానే రహదారుల ఆధునీకరణ, ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రత్యేక చొరవ, కృషితో పట్టణ బైపాస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సెంటర్ లైటింగ్ ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనుల పురోగతిని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బైపాస్ రోడ్డు పొడవునా జరుగుతున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు, వైరింగ్ పనులను వారు దగ్గరుండి వీక్షించారు.ఈ సందర్భంగా పనుల నాణ్యత, ఇప్పటివరకు పూర్తయిన పనుల వివరాలను అక్కడ ఉన్న ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఎక్కడా నాణ్యతా ప్రమాణాల్లో రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతికతతో, నిర్ణీత గడువులోగా పనులన్నీ ముగించి వెలుతురును అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. బైపాస్ రోడ్డులో సెంటర్ లైటింగ్ అందుబాటులోకి వస్తే చీకటి కారణంగా జరిగే రహదారి ప్రమాదాలు పూర్తిగా తగ్గుముఖం పడతాయని, వాహనదారులకు మెరుగైన వెలుతురు లభించి ప్రయాణం ఎంతో సురక్షితంగా మారుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. పట్టణ ప్రజలతో పాటు వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు సైతం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన ధ్యేయమని, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో త్వరలోనే ఈ పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని మున్సిపల్ చైర్మన్ వివరించారు.

# రైతు వ్యతిరేక విధానాలతో కాంగ్రెస్ పాలన: దాస్యం వినయ్ భాస్కర్

## 22 న జరిగే సభను విజయవంతం చేయండి: మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్

## అధికారాన్ని ప్రజాసేవకు ఉపయోగించాలి - మాజీ కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు



**తెలంగాణ వాణి, ఉమ్మడి వరంగల్ బ్యూరో, (జూన్ 20 ) :**
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపించారు. శనివారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు అవస్థలు పడుతున్నారని, రైతులు ఆత్మహత్యల దిశగా నెట్టబడుతున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతు బంధు, 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయ వంటి కార్యక్రమాల ద్వారా రైతులను ఆదుకున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు, ఆరు గ్యారంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అయితే రెండున్నరేళ్ల కాలంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. రైతుల పంటలకు సరైన కొనుగోళ్లు జరపడం లేదని, బోనస్ కూడా అమలు కాలేదని ఆరోపించారు. రైతుల సమస్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు సంగ్రామ సదస్సు ద్వారా ప్రభుత్వాన్ని ప్రశ్నించారని తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మాట్లాడుతూ, ఈ నెల 22న వర్ధన్నపేట నియోజకవర్గంలోని బీఎల్ఏలు, సభ్యత్వ నమోదు ప్రతినిధులు, సోషల్ మీడియా కార్యకర్తలకు మడికొండ సత్యసాయి గార్డెన్‌లో నిర్వహించే ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, ఎన్నికల హామీలను అమలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆయన ఆరోపించారు. కేసీఆర్ హయాంలో మిషన్ కాకతీయ ద్వారా వేలాది చెరువులకు పూడికతీత చేపట్టడంతో పాటు రైతు బంధు పథకం ద్వారా భారీ స్థాయిలో పెట్టుబడి సాయం అందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలు నిర్వీర్యమయ్యాయని, పంటల కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రైతు వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ దేశానికి అన్నం పెట్టే రాష్ట్రంగా ఎదిగిందని, సాగునీటి ప్రాజెక్టులు, రైతు సంక్షేమ కార్యక్రమాలతో వ్యవసాయ రంగానికి కొత్త దిశ చూపించారని అన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.అదేవిధంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిపై చేసిన విమర్శలను ఖండించిన వెంకటేశ్వర్లు, మహిళల అభ్యున్నతి కోసం ఆయన స్వంత నిధులతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని ప్రజాసేవకు వినియోగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నీట్-2026 అభ్యర్థులు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి: జిల్లా కలెక్టర్



**మెదక్, జూన్ 20 (తెలంగాణ వాణి):**
జిల్లాలో జూన్ 21న (ఆదివారం) ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్‌లో నిర్వహించే నీట్ (యూజీ)-2026 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించబడనుండగా, అభ్యర్థులు అడ్మిట్ కార్డు, ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, ఒక పోస్ట్‌కార్డ్ సైజ్ ఫోటోతో పాటు పారదర్శక నీటి బాటిల్ మాత్రమే తీసుకురావాలని తెలిపారు.అడ్మిట్ కార్డులో పేర్కొన్న గేట్ క్లోజింగ్ సమయం మధ్యాహ్నం 1.30 గంటల కంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రంలో ఎన్‌టిఏ అందించే బ్లాక్ బాల్ పాయింట్ పెన్ మాత్రమే ఉపయోగించాలని పేర్కొన్నారు.మొబైల్ ఫోన్లు, గడియారాలు, బెల్టులు, ఆభరణాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పెన్సిళ్లు, రబ్బర్లు, షార్పనర్లు, కరెక్షన్ ఫ్లూయిడ్ వంటి నిషేధిత వస్తువులను కేంద్రానికి తీసుకురావద్దని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించిన అభ్యర్థుల అభ్యర్థిత్వం రద్దు చేయబడటంతో పాటు భవిష్యత్ పరీక్షలకు కూడా అనర్హులుగా ప్రకటించే అవకాశం ఉందన్నారు.అభ్యర్థులు తమ పరీక్షా కేంద్రం చిరునామాను ముందుగానే ధృవీకరించుకుని సమయానికి కేంద్రానికి చేరుకునేలా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నీట్ (యూజీ)-2026 పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు తల్లిదండ్రులు, అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కోరారు.

# గడ్డపోతారంలో అక్రమ షెడ్ల కలకలం

## అనుమతులు లేకుండానే నిర్మాణాలు.. మున్సిపల్ ఆదాయానికి భారీ గండి





**పటాన్‌చెరు, జూన్ 20 (తెలంగాణ వాణి)**
పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని గడ్డపోతారం మున్సిపాలిటీలో మున్సిపల్ అనుమతులు లేకుండానే అక్రమ షెడ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు నేతల అండదండలతోనే అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానిక ప్రజలు, బాధితులు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు తీసుకునేందుకు ప్రయత్నించినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వెనక్కి తగ్గాల్సి వస్తోందనే చర్చ జరుగుతోంది. దీంతో అక్రమ నిర్మాణాలపై నియంత్రణ లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.నిబంధనల ప్రకారం నిర్మాణ అనుమతులు, డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో మున్సిపాలిటీకి రావాల్సిన ఆదాయం కోల్పోతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కమర్షియల్, ఇండస్ట్రియల్ అవసరాలకు అనువైన షెడ్లను నివాస ప్రాంతాల్లో నిర్మించడం వల్ల మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌కు విఘాతం కలుగుతోందని ఆరోపణలు ఉన్నాయి.గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా నిర్మించిన షెడ్లపై జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ చేపట్టి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో రూ.91 లక్షల కుంభకోణం బట్టబయలు





## నకిలీ ట్రక్ షీట్లతో ప్రభుత్వ నిధుల దోపిడీ

## ఆరుగురు అరెస్ట్

**రాజన్న సిరిసిల్ల, జూన్ 20 (తెలంగాణ వాణి)**
ప్రభుత్వ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో నకిలీ ట్రక్ షీట్లను సృష్టించి సుమారు రూ.91 లక్షల ప్రభుత్వ నిధులను అక్రమంగా మళ్లించిన ముఠాను సిరిసిల్ల పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పెద్దూర్ అపారెల్ పార్క్ గోదాం మేనేజర్ ఉత్కం విజయ్, డీఎంఓ కార్యాలయ కో-ఆర్డినేటర్ కమ్మరి రాజశేఖర్ ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించారని వెల్లడించారు. వివిధ ఐకేపీ కేంద్రాల నుంచి ధాన్యం వచ్చినట్లు నకిలీ ట్రక్ షీట్లు రూపొందించి, వాటిని సివిల్ సప్లై వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి ప్రభుత్వ నిధులను తమ ఖాతాల్లోకి మళ్లించుకున్నట్లు దర్యాప్తులో తేలిందన్నారు. అలాగే అపారెల్ పార్క్ గోదాముకు వచ్చిన 10 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయకుండానే రికార్డుల్లో నమోదు చేసి, ఆ ధాన్యాన్ని రైస్ మిల్లులకు విక్రయించి అక్రమ లాభాలు పొందినట్లు గుర్తించామని తెలిపారు.జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎస్. నరసింహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, నిందితుల నుంచి రూ.14.16 లక్షల



నగదును స్వాధీనం చేసుకుని, వారి బ్యాంకు ఖాతాల్లోని రూ.46.21 లక్షలను ఫ్రీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.ప్రధాన నిందితులు ఉత్కం విజయ్, కమ్మరి రాజశేఖర్, చేపూరి మధుకర్, వాసాల గణేష్, గాజుల నవీన్ తదితరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులో మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ హెచ్చరించారు.

# వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు




**ధర్మారం: జూన్ 20 (తెలంగాణ వాణి )**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో శనివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ కార్యక్రమంలో భాగంగా ఉదయం నుండి సాయంత్రం వరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని అయ్యప్ప గోశాలలో మూగజీవాలకు పశు దాన అందించారు. బస్టాండ్ ప్రాంగణంలో ఎమర్జెన్సీ ఫోన్ నెంబర్స్ స్టిక్కర్స్ అతికించి, చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎమర్జెన్సీ కిట్టు అందించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వంకా మామిడి రాజేందర్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ సిరిపురం సత్యనారాయణ, గెస్ట్ ఆఫ్ హానర్ పబ్బా అరుణ, రీజియన్ చైర్పర్సన్ సూర గీత, రీజియన్ సెక్రటరీ మాడిశెట్టి ఉమాదేవి, వాసవి క్లబ్ అధ్యక్షులు యాంసాని రమేష్, ప్రధాన కార్యదర్శి ఈగం ప్రసాద్, జోన్ చైర్మన్ బి రామ్మోహన్, మాజీ అధ్యక్షులు ఎలగందుల అశోక్, కొల్లూరు కిషోర్,మల్యాల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్,గుంత సంతోష్,మల్యాల శివ, ముక్త రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొండపాకలో ఉచిత మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం



**వీణవంక, జూన్ 20, ( తెలంగాణ వాణి ప్రతినిధి )**
వీణవంక మండలంలోని కొండపాక గ్రామంలో డబ్ల్యూ డబ్ల్యూ ఎఫ్-ఇండియా నవక్రాంతి ఉత్పత్తిదారుల సంస్థ బీసీఐ ప్రాజెక్ట్ మరియు ఎస్బిఐ ఆర్ ఎస్ ఈ టి ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత నెలరోజుల మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బీసీఐ క్లస్టర్ కోఆర్డినేటర్ మహేందర్ మాట్లాడుతూ రైతు కుటుంబాల జీవనోపాధి పెంపొందించేందుకు వివిధ స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామంలో నిర్వహించిన సర్వే ఆధారంగా మహిళల ఆసక్తులకు అనుగుణంగా మగ్గం వర్క్ శిక్షణను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.గ్రామ సర్పంచ్ వీరస్వామి మాట్లాడుతూ బీసీఐ, ఎస్బిఐ ఆర్ఎస్ ఈ టి ఐ కల్పిస్తున్న అవకాశాన్ని వినియోగించుకొని గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. బీసీఐ జెండర్ ఎక్స్‌పర్ట్ సౌజన్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థిక స్వావలంబన సాధించాలని అన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ రవిప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ మహిళలు, యువతకు వివిధ ఉపాధి ఆధారిత శిక్షణలు అందిస్తున్నామని, శిక్షణ అనంతరం స్వయం ఉపాధి అవకాశాలపై కూడా మార్గనిర్దేశం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుమార్, మాజీ సర్పంచ్ దాట్ల మంగ, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, హెడ్‌మాస్టర్ రాజయ్య, బీసీఐ అసిస్టెంట్ మేనేజర్ మల్లేష్, సిబ్బంది, శిక్షకులు, లబ్ధిదారులు, రైతులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ విద్యార్థినులకు సైకిళ్ల బహుకరణ



**తెల్లాపూర్ జూన్ 20 (తెలంగాణ వాణి)**
పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో మైత్రి గ్రౌండ్‌లో నిర్వహించిన ఎస్ఎస్సీ టాపర్లకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో, జడ్పీహెచ్ఎస్ తెల్లాపూర్ కి చెందిన 10వ తరగతి ప్రతిభావంతులైన విద్యార్థినులు భార్గవి, ఇందులకు సైకిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి. భాస్కర్, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ ప్రోత్సాహం విద్యార్థులు మరింత ఉన్నత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రేరణగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. విద్యార్థులు వరుస విజయాలు సాధిస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని తెలిపారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం । 21 । జూన్ । 2026

## అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠకు రూ.1 లక్ష విరాళం



తల్లాడ, జూన్ 20 (తెలంగాణ వాణి):
మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి-వీరకృష్ణ దంపతులు రూ.1 లక్షల నగదు విరాళాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా వారు ఆంజనేయ స్వామి ఆశీస్సులతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కోడూరి వీరకృష్ణ, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు ఇస్నేపల్లి లక్ష్మణ్, విలసాగరం శ్రీనివాసరావు, విలసాగరం వెంకటేశ్వర్లు (జూనియర్ కేసీఆర్), వార్డు సభ్యులు కోడూరి దుర్గారావు, విలసాగరం వెంకటరావు, మాజీ సర్పంచ్ గుండ్ల వెంకటేశ్వర్లు, బీరెడ్డి మల్లారెడ్డి, బొడ్డు శ్రీను, గుండ్ల బాలకృష్ణ, బీరెడ్డి ముత్తారెడ్డి, బొడ్డు కృష్ణ, గుండ్ల జోగారావు, బొడ్డు తిరుపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సింగరేణి పరిరక్షణ సదస్సును జయప్రదం చేయండి

### కార్పొరేట్ టీబీజీకేఎస్ ఆఫీసులో పోస్టర్ ఆవిష్కరణ



కొత్తగూడెం సింగరేణి, జూన్ 20 (తెలంగాణ వాణి)
కొత్తగూడెంలో జరిగే సింగరేణి పరిరక్షణ సదస్సును జయప్రదం చేయాలని టీబీజీకేఎస్ ముఖ్య ప్రధాన కార్యదర్శి కాపుకృష్ణ పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా కార్పొరేట్ ఆఫీసులో వైస్ ప్రెసిడెంట్లు తుమ్మ శ్రీనివాస్, గడప రాజయ్య ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాపు కృష్ణ పాల్గొని పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి లో జరుగుతున్నా ఇబ్బందికర పరిస్థితులు మెడికల్ బోర్డు నిర్వహించడం, 250 ఇంటి స్థలం, మారుపేరుల సమస్య అన్నింటి మీద హరీష్ రావు చేత పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుందని తెలిపారు.కాబట్టి కార్మిక సోదరులందరూ పాల్గొనాలని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కంచర్ల శ్రీనివాస్, మీసాల మురళి,నమిళ్ల వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, రవి, సిద్ధూ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



కొత్తగూడెం,సింగరేణి, జూన్ 20 (తెలంగాణ వాణి)
భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి ప్రధాన కార్యాలయంలో శనివారం సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు.జీఎం (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సీఎస్ఆర్ జి.వి. కిరణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా జీఎం (క్వాలిటీ) సీహెచ్. వెంకట రమణ, జీఎం (ఓసీపీ) పి. ఎలిషా, జీఎం (పర్సనల్) ఈఈ అండ్ ఆర్సీ ఏజేఎం మురళీధర రావు, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) బ్రాంచ్ సెక్రటరీ ఎస్వీ. రమణ మూర్తి, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్టీయూసీ) కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. పితాంబర రావు, కార్పొరేట్ సీఎంఓఏఐ ప్రెసిడెంట్ ఎస్. వెంకటాచారి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, భారతదేశంలో పుట్టిన యోగా అంతర్జాతీయంగా గుర్తింపు పొంది మానవాళి ఆరోగ్యానికి ఉపయోగపడుతోందని తెలిపారు. ఈ సంవత్సరం ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే నినాదంతో ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం నిర్వహించుకుంటున్నామని, దీని ద్వారా వ్యక్తి, కుటుంబం, సమాజం శారీరకంగా, మానసికంగా బాగుంటారని పేర్కొన్నారు. గత 12 సంవత్సరాలుగా సింగరేణి సంస్థ యోగాకు పూర్తి సహకారం అందిస్తోందని, ప్రత్యేక బడ్జెట్ కేటాయించి యోగాను నిరంతరం ఆచరించేలా యాజమాన్యం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. యోగా ఆచరణతో వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు పని సామర్థ్యం మెరుగై ఉద్యోగుల కుటుంబాలకు, కంపెనీకి మేలు జరుగుతుందన్నారు.యోగా వల్ల బీపీ, మధుమేహం నియంత్రణలో ఉంటాయని, ముఖ్యంగా ఎక్కువ సేపు కూర్చుని పనిచేసే ఉద్యోగులు, పని ఒత్తిడికి గురయ్యేవారు రోజుకు కనీసం 30 నిమిషాలు యోగా సాధన చేయాలని సూచించారు. ప్రముఖ శాస్త్రీయ నృత్యకళాకారిణి సీతాప్రసాద్ బృందం యోగా పై నృత్య ప్రదర్శన చేసి అవగాహన కల్పించారు. అనంతరం అందరూ కలిసి యోగా ప్రతిజ్ఞ స్వీకరించి సామూహిక యోగాసనాలు వేశారు.ఈ కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్)లు కేసా నారాయణ రావు, బి. శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కార్పొరేట్ పరిధిలోని వివిధ శాఖల జనరల్ మేనేజర్లు, విభాగాధిపతులు, ఉద్యోగులు, ఎస్ అండ్ పీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్, సింగరేణి మహిళా కళాశాల, నర్సింగ్ కళాశాల విద్యార్థినులు, యోగా మాస్టర్లు పాల్గొన్నారు.



## ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా




నిర్మల్, జూన్ 20(తెలంగాణ వాణి ప్రతినిధి)
కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో విజయ డైరీ పురోగతిపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత శాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విజయ డైరీ ద్వారా పాడి రైతులకు అందుతున్న సేవలు, పాల సేకరణ సామర్థ్యం పెంపు, మార్కెటింగ్ లో చేపట్టాల్సిన మార్పులపై చర్చించారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పాడి పరిశ్రమను లాభాల బాటలో నడిపించేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఆదేశించారు.పాల సేకరణ కేంద్రాల విస్తరణ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడమే ప్రధాన ధ్యేయంగా పనిచేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విజయ డైరీ ఉత్పత్తులు ఎల్లప్పుడూ నాణ్యతను పాటిస్తూ, మార్కెట్లో వాటి లభ్యతను విస్తృతం చేయడం ద్వారా వినియోగదారుల నమ్మకాన్ని చూరగొనాలని సూచించారు. పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, రాయితీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ఉన్న అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని పేర్కొన్నారు. విజయ డైరీని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన సహకారం అందిస్తామన్నారు. ప్రభుత్వ రంగ పాడి పరిశ్రమ అభివృద్ధి వల్ల పాడి రైతులు ఆర్థికంగా లాభం పొందడమే కాకుండా, ప్రజలకు మెరుగైన పాలు, పాల ఉత్పత్తులు అందుతాయని తెలిపారు. అనంతరం కలెక్టర్ కు విజయ డైరీ ఉత్పత్తులు సంస్థ అధికారులు అందించారు. ఈ సమావేశంలో విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డిఆర్డీఓ విజయలక్ష్మి, పశుసంవర్ధక అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఎల్డీఎం రాంగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసు కీర్తి ప్రతిష్టలు పెరిగేలా విధుల నిర్వహణ చేపట్టాలి: జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, జూన్ : 20 ( తెలంగాణ వాణి ప్రతినిధి )
సిబ్బంది ప్రతి ఒక్కరూ యూనిఫామ్ కు ఉన్న గౌరవాన్ని పెంచే విధంగా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. స్థానిక ఏఆర్ హెడ్ క్వార్టర్స్ నందు జరిగిన పరేడ్ నందు జిల్లా ఎస్పీ పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేయడం జరిగింది. మొదటగా ఆదిలాబాద్ జిల్లా పోలీసుల పనితీరు ను రాష్ట్ర డిజిపి అభినందించినందుకు గాను దానికి తగ్గ ప్రతిఫలం ప్రతి ఒక్క సిబ్బందికి చెందుతుందని పేర్కొంటూ సిబ్బందిని ప్రతి ఒక్కరిని అభినందించారు. సిబ్బంది పరేడ్, లాటి డ్రిల్, ట్రాఫిక్ డ్రిల్, ఆయుధాల వినియోగం పై సిబ్బందికి శిక్షణ అందించి, పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రతిరోజు వ్యాయామం నిర్వహిస్తూ శారీరక దృఢత్వాన్ని కలిగి ఉండాలని తెలిపారు. మొదటగా సిబ్బంది గౌరవ వందనాన్ని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ కి అందజేసి, పరేడ్ నిర్వహించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా సిబ్బంది ప్రతిరోజు వ్యాయామం చేయాలని ప్రతి వరం శనివారం నిర్వహించే పరేడ్ నందు పాల్గొని పోలీసు నిర్వహించే కవా తునందు పాల్గొని పరిపూర్ణత చెందాలని సూచించారు. సిబ్బంది ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ, సమయపాలన తప్పనిసరిగా ఉండాలని విధుల నందు ఎలాంటి నిర్లక్ష్యాన్ని వహించవద్దని సూచించారు. ముఖ్యంగా సిబ్బంది ఇతరులకు షూరిటీ (లోన్ నందు హామీ) ఇచ్చే సమయంలో సరైన వారికి ఇవ్వాలని లేని పక్షంలో ఇబ్బందులను ఎదుర్కోవాల్సి



వస్తుందని తెలిపారు. చట్టం ప్రతి ఒక్కరికి సమానమని అందరికీ ఒకేలా వ్యవహరిస్తుందని, ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు కానీ పాల్గొన్నట్లయితే వారికి మినహాయింపులు ఉండవని హెచ్చరించారు. విధులను నిర్వర్తిస్తున్న క్రమంలో చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. పరేడ్ నందు జిల్లాలోని అన్ని పోలీసు కార్యాలయాలలో మరియు ఏ ఆర్ హెడ్ క్వార్టర్స్ నందు పరేడ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. 50 సంవత్సరముల పైబడిన సిబ్బందికి ప్రత్యేకంగా యోగ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, సిఐలు బి సునీల్ కుమార్, చంద్రశేఖర్, బి డి ప్రేమ్ కుమార్, కె ఫణిదర్, ప్రణయ్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు డి వెంకటి, ఎన్ చంద్రశేఖర్, సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం

### కలెక్టర్ చిత్రా మిశ్రాడ్రగ్స్ రహిత కరీంనగర్ లక్ష్యంగా సమష్టిగా కృషి చేద్దాం

కరీంనగర్:జూన్ 20 (తెలంగాణ వాణి ప్రతినిది)
మత్తు పదార్థాలు,మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు.శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో పోలీస్ శాఖ,మహి ళా శిశు సంక్షేమ శాఖ సం యుక్త ఆధ్వర్యంలో నార్కోటిక్ కోఆర్డినేషన్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,వివిధ శాఖల అధికారులు పాల్గొ న్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,మాదక ద్రవ్యాల నియంత్రణ సమాజం లోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు. యువతను మత్తు బారిన పడకుండా కాపాడేందుకు తల్లిదండ్రులు,ఉపాధ్యాయు లు,ప్రజా ప్రతినిధులు,స్వచ్ఛం ద సంస్థలు,విద్యాసంస్థలు సమన్వయంతో పనిచేయా లని సూచించారు.డ్రగ్స్ రహిత జిల్లాగా కరీంనగర్‌ను తీర్చిదిద్దేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించ డం ద్వారా యువతను సరైన మార్గంలో నడిపించవచ్చని పేర్కొన్న ఆమె,మాదకద్రవ్యా లకు సంబంధించిన సమా చారం తెలిసిన వెంటనే పోలీసులకు అందించాలని సూచించారు.పోలీస్ కమి షనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ,ఈ నెల 26న నిర్వహించే అంత ర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించు కుని జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు, ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలకు, గ్రామ సభల ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో మత్తు పదార్థాల




నియంత్రణకు ప్రత్యేక దాడులు నిర్వహిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటు న్నామని పేర్కొన్నారు.ఈ నెల 22 నుంచి విద్యార్థులతో పోస్టర్ డ్రాయింగ్ పోటీలు నిర్వహించడం,విద్యాసంస్థల ను సందర్శించి తల్లిదం డ్రులు, ఉపాధ్యాయులతో సమా వేశాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్ట నున్నట్లు తెలిపారు.అలాగే ఈ నెల 26న ర్యాలీలు,గ్రామ సభలు,డ్రగ్ కమిటీ సమావే శాలు నిర్వహిం చనున్నట్లు వివరించారు.విద్యాసంస్థలకు 100 మీటర్ల పరిధిలో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదా ర్థాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాల ని ప్రజలను కోరారు.ఈ సమావేశంలో ఆర్డీవోలు షర్మిల,జల కుమారి,ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస రావు నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రఫిక్ ఖాన్ పోలీస్, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులు జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, విద్యార్థులు,యువజన సంఘాలు,మహిళా సంఘాలు ,ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షల భద్రతపై పోలీసు అధికారులకు సీపీ దిశానిర్దేశం

### కరీంనగర్‌లో 7 పరీక్ష కేంద్రాలు
### 3000 మంది విద్యార్థులు
### పరీక్షా కేంద్రాల వద్ద రెండంచెల తనిఖీ,
### 144 సెక్షన్ అమలు
### జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ కేఫ్‌ల మూసి వేతకు ఆదేశం

కరీంనగర్ జూన్ 20 (తెలంగాణ వాణి)
నేడు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షను పురస్కరించుకుని, జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టినట్లు కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం,తెలిపారు. శనివారం అస్త్ర కన్వెన్షన్ హాల్‌లో పరీక్షల భద్రతా ఏర్పాట్లపై ఆయన పోలీస్ అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించి,పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ, కరీంనగర్ పరిధిలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని దాదాపు 3000 మంది విద్యార్థులు ఈ పరీక్ష కు హాజరుకానున్నారని



తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సం ఘటనలు జరగకుండా భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయా లని అధికారు లను ఆదేశించారు.సీపీ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు: 144 సెక్షన్ అమలు: పరీక్షా కేంద్రాల పరిసర ప్రాం తాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదుగురు అం తకంటే ఎక్కువ మంది గుంపులుగా చేరడం నిషిద్ధమని స్పష్టం చేశారు.జిరాక్స్ సెంటర్ల మూసివేత: పరీక్ష జరుగుతున్న సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లు ఇంటర్నెట్ కేఫ్‌లను తప్పనిసరిగా మూసి వేయించాలి. రెండంచెల తనిఖీ: విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిబంధనల ప్రకారం అభ్య ర్థులను రెండంచెల క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే లోపలికి అనుమతించాలి.ట్రాఫిక్ నియంత్రణ:విద్యార్థు లు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ పోలీ సులు ప్రత్యేక చర్యలు చేప ట్టాలని,కేంద్రాల వద్ద వాహ నాల రద్దీ లేకుండా



చూడాలని ఆదేశించారు.పోలీస్ కమిషనర్ హెచ్చరిక:విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన నీట్ పరీక్షను ఎలాంటి అవకతవకలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించడమే మన బాధ్యత.ఎవరైనా అల్లరి మూకలు పరీక్షకు ఆటంకం కలిగించినా లేదా అక్రమాలకు పాల్పడినా చట్టప్రకారం అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం.ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలోని ఏసీపీలు విజయ కుమార్,యాదగిరిస్వామి, సతీష్,వెంకటస్వామి లతో పాటు సీఐలు,ఎస్ఐలుమరియుఇతరపోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



కొత్తగూడెం సింగరేణి, జూన్ 20 (తెలంగాణ వాణి)
అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం సింగరేణి ఏరియాలో భారీ యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు కోల్ ఇండియా అనుబంధ సంస్థల్లో యోగా కార్యక్రమాలు చేపట్టాలని వచ్చిన ఆదేశాలతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా వేడుకలు జరిగాయి.సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి దిశానిర్దేశాలతో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం. షాలేం రాజు ఆధ్వర్యంలో ఏరియాలోని అన్ని గనులు, విభాగాల్లో యోగా కార్యక్రమాలు జరిగాయి.శనివారం ఉదయం 8 గంటలకు రుద్రంపూర్ ఆర్సీఓఏ క్లబ్ ప్రాంగణంలో నిర్వహించిన భారీ యోగా ప్రదర్శనకు జీఎం ఎం. షాలేం రాజు ముఖ్య అతిథిగా హాజరై యోగా సాధనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని "ఆరోగ్యకర వృద్ధాప్యం కోసం యోగా" అనే థీమ్‌తో నిర్వహిస్తోందన్నారు.ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో కొంత సమయాన్ని యోగా సాధనకు కేటాయించాలని, సురక్షితమైన పని విధానాలను పాటిస్తూ ఆరోగ్యవంతమైన జీవనశైలితో ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగూడెం ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు కృషి చేయాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎం. గోవిందరావు, ఏఐటీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ రాములు, ఐఎన్టీయూసీ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ ఎం.డి. రజాక్, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ ఉపేందర్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మొక్కపాటి వెంకటేశ్వరరావు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఎంవీటీసీ మేనేజర్ లక్ష్మణ్, వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, అప్రెంటిస్‌లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## త్రివేణి పాఠశాలలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహణ





లక్ష్మీదేవిపల్లి, జూన్ 20 (తెలంగాణ వాణి)
త్రివేణి పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, యోగా శారీరక, మానసిక ఆరోగ్యాలను మెరుగుపరిచే గొప్ప సాధనమని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనశైలి అలవడటంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా యోగా శిక్షకుల ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థిని విద్యార్థులను, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులను .త్రివేణి పాఠశాల డైరెక్టర్లు గొల్లపూడి జగదీష్, డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సీఆర్వో కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ సింగ్, సూర్యనారాయణ మూర్తి వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక The Voice of Telangana
ఆదివారం । 21 । జూన్ । 2026

# మాస్టర్ ఈ కే ఆర్గనైజేషన్ కొత్తగూడెం బ్రాంచ్ గ్రామ సేవా యజ్ఞం

## 16వ డివిజన్ రామవరంలో మాస్టర్ ఇ.కే శతాబ్ద ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ గణపతి ఆలయంలో హెల్త్ క్యాంప్



కొత్తగూడెం, జూన్ 20 (తెలంగాణ వాణి)

కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్లో మాస్టర్ ఇ. కే.ఆధ్యాత్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా గ్రామ సేవ యజ్ఞం నిర్వహించారు. శనివారం నాగయ్య గడ్డ లోని శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గ్రామ సేవ యజ్ఞంలో మాస్టర్ ఇ. కే ఆధ్యాత్మిక సేవా సంస్థ కొత్తగూడెం బ్రాంచ్ ఫౌండర్లలో ఒకరైన శ్రీ రవిచంద్ర ఆధ్వర్యంలో 16వ డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ వెంకటేశ్వర్లు దంపతులతో గ్రామ సేవ హోమం , ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆలయంలో రామవరం వాసులకు వారి వారి శరీర రుగ్మతులను బట్టి కేస్ షీట్ (జబ్బుకు సంబంధించిన పత్రం )వివరంగా తాయారు జేసీ జబ్బులను బట్టి వారి దీర్ఘకాలిక శారీరక రుగ్మతులను బట్టి ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ రవిచంద్ర మాట్లాడుతూ ఆరోగ్య నికి ఔషధ సేవ ముఖ్యం కాదు ,ఆరోగ్యమునకు మూలము సరియైన ఆహారము, విహారము అని మనము తోటి వ్యక్తులతో అలాగే ప్రకృతితో వ్యవహరించే తీరు మన ఆరోగ్యానికి మూలమవుతుంది. కాబట్టి అందరూ కూడా వారి, వారి ఆహార వ్యవహారాలను, ప్రవర్తనను సరిచేసుకున్నట్లయితే అందరూ ఆరోగ్యంగా ,ఆనందంగా ఉండగలరు ఆయన అన్నారు. ఆ తర్వాతే ఔషధ సేవ అని పేర్కొన్నారు. అనంతరం 100 మంది పేషంట్లకు ఉచిత హోమియో మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మాస్టర్ ఇ. కే ఆధ్యాత్మిక సేవా సంస్థ సభ్యులు జి లత ,ఆర్ రామారావు, కె శ్రీనివాసరెడ్డి, కె స్వామి, సౌజన్య ,వీరమల్లు ,పి శ్రీధర్రావు ,బి కోటేశ్వరరావు ,కె కమల , నాగేశ్వరరావు ,బి.వి చారి ,ఎస్ మనోహర్ కుమార్, కె శ్రీనివాస్, ఎండి ఫజల్ శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ కమిటీ నిర్వాహకులు ఫణి కుమార్ ,పితాని అబ్బులు ,జూపాక రమేష్, నజీర్ ,పాటి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# రెట్రో రిఫ్లెక్టివ్ టేప్ విధానం రద్దు చేయాలి : కంచర్ల జమలయ్య

## ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా



కొత్తగూడెం, జూన్ 20 (తెలంగాణ వాణి)

రెట్రో రిఫ్లెక్టివ్ టేప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఈ విధానం వల్ల ఆటో డ్రైవర్లతో పాటు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు, ఆర్థిక నష్టం కలుగుతున్నాయని ఏఐటీయూసీ అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు.శనివారం కొత్తగూడెం పరిధిలోని ఆర్టీఏ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి, అనంతరం ఆర్టీఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ మోటారు వాహన చట్టంలో ఎక్కడా లేకపోయినా రవాణా శాఖ వీటికి కొత్తగా క్యూఆర్ కోడ్ నిబంధనను చేర్చి ప్రైవేట్ కంపెనీల దోపిడీకి ఊతమిస్తోందని మండిపడ్డారు.గతంలో వాహనదారుల ఆందోళనలతో వెనక్కి తగ్గిన రవాణా శాఖ, ఇప్పుడు మళ్లీ గుట్టుగా ఈ దోపిడీ విధానాన్ని అమలులోకి తెచ్చిందని విమర్శించారు. సాధారణ రిఫ్లెక్టివ్ టేపుల కంటే రెట్టింపు ధరలతో విక్రయిస్తూ, వాహనం చుట్టూ 22 మీటర్ల నుంచి 26 మీటర్ల వరకు టేపులను అతికించాలనే కొత్త నిబంధనతో ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, లారీలు, బస్సుల యజమానులపై వేలాది రూపాయల అదనపు భారం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కేవలం ఒకే ఒక్క ప్రైవేట్ కంపెనీకి లాభం చేకూర్చడం కోసమే ఈ దోపిడీకి రంగాన్ని సిద్ధం చేశారని, తక్షణమే ఈ నిబంధనలను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. క్యూఆర్ కోడ్ నిబంధనతో వాహనదారులపై మోయలేని ఆర్థిక భారం పడుతోందని, చట్టంలో లేని నిబంధనలను గుట్టుగా అమలు చేయడంపై ఉద్యమిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మర్రి కృష్ణ, చింటూ, సురేష్, మోహన్, శీను, సోను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా పథకం ఒక వరం

## డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల

## రైతులకు ఈనెల 30 వ తేదీ నుండి రైతు భరోసా పైకం పంపిణి

## 30న రైతు సమ్మేళన సభకు ఖమ్మం జిల్లాకు రానున్న సీ.ఎం రేవంత్ రెడ్డి

పాల్వంచ, జూన్ 20 (తెలంగాణ వాణి)



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న రైతు భరోసా పథకం తెలంగాణ రైతులకు వరమని డీసీఎంస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. రైతులకు వానాకాలం సాగు పెట్టుబడి నిమిత్తం 9000 కోట్ల భారీ బడ్జెట్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని ఈనెల 30 వ తేదీన ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాలోని మధిర నియోజకవర్గం లో రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారని అన్నారు. దీనితో రాష్ట్రంలోని రు.73 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రైతులకు ప్రతి ఎకరానికి రు. 6000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించి రైతాంగాన్ని ఆదుకుంటున్నదని కొత్వాల అన్నారు. రైతు భరోసా తో పాటు సన్న వడ్లకు క్వింటాకు 500 రూపాయల బోనస్, వరి, మొక్కజొన్న పంటలకు ప్రభుత్వం మద్దతు ధర వంటి రైతు సంక్షేమ పథకాలు చేపడుతూ రైతాంగాన్ని ఆదుకుంటున్నదని కొత్వాలన్నారు. సీ.ఎం రేవంత్ రెడ్డి పర్యటనను జయప్రదం చేయాలి రైతు భరోసా పథకం ప్రారంభానికి ఈనెల 30వ తేదీన ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం వస్తున్న సీ.ఎంరేవంత్ రెడ్డికి రైతులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతం పలకాలని కొత్వాల కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండ కట్టాలి

## 6 గ్యారంటీలు, 420 హామీలు అమలు చేయడం చేతకాని ప్రభుత్వం

## ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

## బిజెపి రాష్ట్ర కార్యదర్శి కరణం సాయి పరిణితి



కొత్తగూడెం, జూన్ 20 (తెలంగాణ వాణి)

తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి బిజెపి కార్యకర్త విస్తృత ప్రచారం చేసి ప్రజల ముందు ఉంచాలని బిజెపి రాష్ట్ర కార్యదర్శి కరణం సాయి పరిణితి పేర్కొన్నారు. శనివారం జిల్లా బిజెపి కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి రానున్న ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ గెలుపులో ప్రతి కార్యకర్త, నాయకులు భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి బిజెపి కార్యకర్త పార్టీ కోసం పని చేస్తూ పార్టీని తెలంగాణలో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 6 గ్యారెంటీలు,420 హామీలను గుర్తించి అధికారులకు వచ్చిందని, సదరు హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే జాబ్ క్యాలెండర్ ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలను కూడా నేటికీ అమలు కావడం లేదన్నారు. దీనివల్ల యువత పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అదేవిధంగా ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కూడా రేవంత్ రెడ్డి సర్కారు పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ అధ్యక్షులు కే.వి.రంగా కిరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుంజా ధర్మ, పొడియం బాలరాజు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి పుణ్యం బిక్షపతి, కొత్తగూడెం కార్పొరేషన్ చెరుకు భాగ్యలక్ష్మి, ఎస్ ఐ ఆర్ జిల్లా కన్వీనర్ మోహన్ కృష్ణ, డాక్టర్ వెంకన్న, భోగి కృష్ణయ్య, ఉపాధ్యక్షులు భూక్య దివ్యశ్రీ, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి కుమార్, వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బిజెపి మహిళా మోర్చా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

## డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న





సుజాతనగర్, జూన్ 20 (తెలంగాణ వాణి)

ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న పేర్కొన్నారు. శనివారం సుజాతనగర్ మండలం గరీపేటలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి భోజన నాణ్యత, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి చదువు, ఆటలు, భవిష్యత్ లక్ష్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఉత్సాహం చూసి సంతోషం వ్యక్తం చేశారు.డిజిటల్ క్లాస్‌రూమ్‌లోకి వెళ్లి బోధనా పద్ధతులు, టెక్నాలజీ వినియోగాన్ని పరిశీలించారు. 21వ శతాబ్దపు విద్య అంటే స్మార్ట్ క్లాస్‌లు తప్పనిసరి. రేవంత్ రెడ్డి పిలుపు మేరకు, ప్రతి ఒక్క విద్యార్థికి నాణ్యమైన ఆహారం, నాణ్యమైన విద్య అందాల్సిందే అని దేవి ప్రసన్న అన్నారు.స్కూల్ ఆవరణలోని పచ్చదనం, శుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. విద్యార్థుల చదువు, క్రమశిక్షణ, మౌలిక వసతుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల కృషిని అభినందిస్తూ, వారికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.స్కూల్ అంటే కేవలం భవనం కాదు – పిల్లల భవిష్యత్తును తయారు చేసే ఫ్యాక్టరీ అని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా తీర్చిదిద్దడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు కోనేరు సత్యనారాయణ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చీకటి కార్తీక్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై. శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీలు ఎం. ప్రసాద్ బాబు, పైడా రాజేంద్రప్రసాద్, సొసైటీ చైర్మన్ వీర హనుమంతరావు, జయ్ సంవిధాన్ నాయకులు అర్జున్ రావు, కాంతోటి పాల్, సర్పంచ్ దివ్య తేజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్రా అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామ్మూర్తి, ఉపేందర్, సర్పంచులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు చిమ్మట నాగేశ్వరరావు, మాడేపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ కార్యకర్తలు, స్కూల్ హెచ్ఎం లీలా, ఉపాధ్యాయులు జహంగీర్ షరీఫ్, జి. నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో ఘనంగా జాతీయ మెగా లోక్ అదాలత్ ప్రారంభం



మధిర, జూన్ 20 (తెలంగాణ వాణి):

మధిర కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మధిర జూనియర్ సివిల్ జడ్జి దీప్తి వేముల మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదికగా నిలుస్తుందని తెలిపారు. న్యాయస్థానాల్లో సంవత్సరాల పాటు కొనసాగే వివాదాలను తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో పరిష్కరించుకునే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా చెక్కు బౌన్స్ కేసులు, మోటారు ప్రమాద పరిహార కేసులు, బ్యాంకు రుణాలు, కుటుంబ వివాదాలు తదితర అంశాలను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ సందర్భంగా పలు సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించి సంబంధిత పక్షాలకు అవార్డు కాపీలు అందజేశారు. లోక్ అదాలత్‌లో కుదిరిన రాజీ తీర్పులకు చట్టబద్ధత ఉండటంతో పాటు వాటిపై అప్పీల్‌కు అవకాశం ఉండదని, ఇరు పక్షాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని న్యాయమూర్తి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చావలి రామరాజు, ఏపీపీ జన్ను భద్రయ్య, పట్టణ సీఐ రమేష్, ఎస్ఐలు నవిత, విశ్వతేజ, ఎం. అబ్రహాం, సీనియర్ న్యాయవాదులు వాసంశెట్టి కోటేశ్వరరావు, డి. జగన్మోహన్‌రావు, బి. పుల్లారావు, నంబూరి జనార్దనరావు, పల్లపోతుల కృష్ణారావు, టి. వెంకట్రావు, విజయ్‌కుమార్, జే. రమేష్, మాధురి తేజ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవీర యోగా శిక్షణ శిబిరంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



హుస్నాబాద్ జూన్ 20 (తెలంగాణ వాణి ఆర్ సి)

హుస్నాబాద్ పట్టణంలోని బురుజు సమీపంలోని వ్యవసాయ కూర గాయల మార్కెట్ భవనం ఎదుట ధర్మవీర్ యోగ శిక్షణ శిబిరం శిక్షకురాలు అయిలేని అనితాదేవిఆధ్వర్యంలో ముందస్తు అంతర్జా తీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణ శిబిర సాధకులు యోగాసనాలు, ధ్యానం చేశారు. యోగ సాధన వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, మాన సిక ప్రశాంతత గురించి అనిత దేవి వివరించారు. అనంతరం యోగ శిక్షకురాలు అనితా దేవికి యోగ శిబిర సాధకులు శాలువా తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కౌన్సిలర్ సావుల మంజుల, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కేడం లింగమూర్తి, ఆకుల వెంకన్న, చిత్తారి రవీందర్, వడ్డేపల్లి వెంకటరమణ, మండల విద్యాధికారి బండారి మనీలా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన రజని, డాక్టర్ రమాదేవి, మాజీ కౌన్సిలర్లు భాగ్యరెడ్డి, బోజు రమ, ఎంఎండీ సభ్యులు, యోగ సాధకులు తదితరులు పాల్గొన్నారు.

# పేదోడి కల సాకారం

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న



సుజాతనగర్, జూన్ 20 (తెలంగాణ వాణి)

ప్రతి పేదోడి ఆత్మగౌరవం – ఇందిరమ్మ ఇల్లు అనే నినాదానికి కొత్తగూడెంలో సార్థకత చేకూరింది. సుజాతనగర్ మండలం బేతాళుపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మించిన నూతన భవనాన్ని కొత్తగూడెం డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న శనివారం లబ్ధిదారు కుటుంబంతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారుడి ఇంటిని రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించిన అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లో అడుగుపెట్టారు. కొత్త ఇంట్లో పాలు పొంగించి, దీపం వెలిగించి లబ్ధిదారుల ఆనందంలో పాలుపంచుకున్నారు.ఇందిరమ్మ ఇల్లు అంటే కేవలం ఇటుకలు, సిమెంట్ కాదు – ఒక తల్లి భద్రత, ఒక పిల్లాడి చదువు, ఒక కుటుంబం గౌరవం అని ఈ సందర్భంగా దేవి ప్రసన్న అన్నారు. ఇందిరా గాంధీ కల సౌధాలుగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించామని, రాహుల్ గాంధీ స్ఫూర్తితో పేదల కష్టాలు తీర్చడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని స్పష్టం చేశారు. కిరాయి ఇంట్లో బతికిన వారికి ఈ రోజు సొంత గూడు దక్కడం సంతోషంగా ఉందన్నారు.ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లంచం లేకుండా, పూర్తి పారదర్శకంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని దేవి ప్రసన్న హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ మాలోత్ మంగీలాల్, జిల్లా సెక్రటరీ రామకృష్ణ, బాలాజీ, లక్ష్మీనారాయణ, మహేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారు కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారం

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత




కొత్తగూడెం, జూన్ 20 (తెలంగాణ వాణి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగ హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్‌పర్సన్ జి. ప్రేమలత మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా ప్రజలు తమ వివాదాలను సత్వరంగా, సులభంగా మరియు తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు కేసులను పరస్పర రాజీ మార్గం ద్వారా పరిష్కరించే అవకాశం లోక్ అదాలత్ ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అనంతరం మోటారు వాహన ప్రమాద కేసులలో రాజీ కుదిరిన బాధితులకు అవార్డు కాపీను అందజేశారు. కక్షిదారులకు పులిహోర, మంచినీటి సదుపాయాన్ని ఎస్బీఐ బ్యాంకు వారి సౌజన్యంతో అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం. కిరణ్ కుమార్ న్యాయవాదులు, బ్యాంకు ప్రతినిధులు, కక్షిదారులు మరియు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నిర్మల్, జూన్ 20(తెలంగాణ వాణి ప్రతినిధి)



సారంగాపూర్ మండలంలోని కంకట గ్రామానికి చెందిన నడికుడి లస్మన్న తన కుటుంబం లో జరిగిన ఊహించని సంఘటనలు యువకులైన కుమార్తె మరణం ,కుమారుని మరణం గత ఏప్రిల్ నెల లో అనారోగ్యం తో తన భార్య మరణంతో చాలా కృంగి పోయారు .నిన్నటి నుండి కనిపించక పోవడంతో బంధువులు ఈ రోజు ఉదయం నుండి వెదకడం ప్రారంభించగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ సమీపంలోని మునిపల్లి శివారులో శవమై కనిపించారు. గ్రామము లో అందరితో కలిగొలుపుగా ఉండే వ్యక్తి మరణం తో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# సంజయ్ ఆప్యాయపు పలకరింపు



జమ్మికుంట, జూన్ 20 :(తెలంగాణ వాణి ప్రతినిధి)

నూతనంగా ఎన్నికైన జమ్మికుంట పదో వార్డ్ కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ కుటుంబాన్ని కలిసి నా కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్.జమ్మికుంట పట్టణంలోని పదో వార్డు కౌన్సిలర్ తూర్పాటి చందన శంకర్ ఇంటికి స్వయంగా వెళ్లి చం దన శంకర్ల పాపతో మరియు వారి కుటుంబ సభ్యులతో ఆప్యా యంగా ముచ్చటించారు. ప్రతి కార్యకర్తకు అండగా బండి సం జయ్ ఉంటాడని కష్టకాలంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా నిండు గర్భంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన తూర్పాటి శంకర్ చందనను అభినందించారు. తప్పకుండా రానున్న రోజులలో మీరు గొప్ప స్థాయి చేరుకుంటారని ఎప్పుడూ మీకు ఈ సంజయ్ అన్న తోడుంటాడని హామీ ఇచ్చాడు. ఈ కార్యక్రమంలో తూర్పాటి చందన శంకర్ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.